సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



బాస్కెట్‌బాల్ చాంప్‌లు వీరే..

34వ జాతీయ బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్‌లో డీఎంఎస్, రాజస్థాన్ క్షేత్ర, ఉత్తరక్షేత్ర విద్యార్థులు సత్తా చాటారు. 10లో



ప్రీ ప్రైమరీ స్కూళ్లకు మహర్దశ

అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్పు చేస్తున్న నేపథ్యంలో.. ఈ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారు. 10లో



సకాలంలో సమస్యల పరిష్కారం

'జగనన్నకు చెబుదాం'లో వచ్చిన వినతులను సకాలంలో పరిష్కరించాలని డీఆర్వో కె.మోహన్‌కుమార్ ఆదేశించారు. 10లో

ఉజ్వల విశాఖ



ఇన్ఫోసిస్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- ఐటీ, ఫార్మా కంపెనీలను ప్రారంభించిన సీఎం జగన్
- ఇన్ఫోసిస్ రాకతో బీచ్ ఐటీ కాన్సెప్ట్‌కు కొత్త ఉత్సాహం
- డేటా సెంటర్ డెస్టినేషన్‌గా విశాఖ అభివృద్ధి
- ఫార్మా సెజ్‌లో కంపెనీల విస్తరణతో భారీగా ఉపాధి అవకాశాలు
- విశాఖ నుంచి పరిపాలన సాగిస్తామన్న ముఖ్యమంత్రి
- ఉత్తరాంధ్రకు ఉత్సాహాన్నందించిన ముఖ్యమంత్రి పర్యటన

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్రతో పాటు సరిహద్దు జిల్లాల అభివృద్ధే లక్ష్యంగా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ పర్యటన ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. పరిపాలనకు ప్రధాన కేంద్రంగా.. భవిష్యత్తులో ఉపాధికి కేంద్ర బిందువుగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు అడుగులు పడుతున్నాయన్న సీఎం మాటలు.. ఈ ప్రాంత ప్రజలకు ముఖ్యంగా యువత ఆశలకు ఊపిరి పోశాయి. ఐటీ హబ్‌గా విశాఖను అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్న విషయం ఇన్ఫోసిస్ ప్రారంభోత్సవంతో మరోసారి నిరూపితమైంది. తొలి విడతలో 1000 మంది ఉద్యోగుల సామర్థ్యంతో ఇన్ఫోసిస్ డేటా సెంటర్ కార్యకలాపాలను ముఖ్యమంత్రి సోమవారం ప్రారంభించారు. ఇదే బాటలో మరికొన్ని సంస్థలు విశాఖ వైపు అడుగులు వేస్తున్నాయని సీఎం ప్రకటనతో విద్యార్థుల్లో నూతనోత్తేజం నెలకొంది. ఇప్పటికే విప్రో సంస్థ తమ సంస్థ కార్యకలాపాలను 1000 మంది వరకు విస్తరిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. మిగిలిన కంపెనీలు కూడా బీచ్ ఐటీ డెస్టినేషన్‌కు వస్తే.. ఉత్తరాంధ్ర యువతకు విశాఖ ఐటీ ఎంప్లాయిబిలిటీ డెస్టినేషన్‌గా మారనుంది.



ఇన్ఫోసిస్ కార్యాలయంలో సీఎం జగన్

- అలాగే సముద్రతీర ప్రాంత శుభ్రత కోసం జీవీఎంసీ రూ.15 కోట్లతో ఏర్పాటు చేసిన 6 బీచ్ క్లీనింగ్ యంత్రాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు.



బీచ్ క్లీనింగ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

సీఎంవో ఇక్కడి నుంచే..

ఈ ఏడాది చివర్లో విశాఖ నుంచి పరిపాలన సాగిస్తానంటూ సీఎం జగన్ చేసిన ప్రకటనతో ఉత్తరాంధ్ర వాసుల్లో నూతన ఉత్సాహం పెల్లుబికింది. రెండేళ్లలో భోగాపురం అంతర్జాతీయ పౌర విమానాశ్రయం అందుబాటులోకి రాబోతోందని సీఎం ప్రకటించడంతో.. ఉత్తరాంధ్రకు మంచిరోజులు వచ్చాయని ప్రజలంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. పేరుకే భోగాపురం విమానాశ్రయం అయినప్పటికీ.. వైజాగ్ ఎయిర్‌పోర్టుగానే వ్యవహరించనుంది. ఎందుకంటే విశాఖపట్నం నుంచే ఎక్కువగా రాకపోకలు సాగనున్నాయి. దీనికి అనుసంధానంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే కూడా రానుండటంతో బీచ్‌రోడ్డుతో పాటు భీమిలి నుంచి భోగాపురం వరకు ఆయా ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందనున్నాయి.



ఇన్ఫోసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

డిజిటల్ విప్లవానికి నాంది..



ఇన్ఫోసిస్ కార్యాలయంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

మధురవాడలోని హిల్ నం.4లో డిజిటల్ విప్లవం మొదలుకానుంది. ఇది కేవలం విశాఖకు.. రాష్ట్రానికి.. దేశానికి మాత్రమే కాదు.. యావత్ ఆసియా దేశాలకు పెద్దన్నగా మారనుంది. ప్రముఖ అదానీ సంస్థ ఏర్పాటు చేస్తున్న ఈ డేటా సెంటర్, టెక్నాలజీ బిజినెస్ సెంటర్.. 190 ఎకరాల్లో రూ.20 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో నిర్మితమవుతోంది. ఇది కూడా త్వరలోనే అందుబాటులోకి రానుందని సీఎం వైఎస్ జగన్ చెప్పారు. దీంతో పాటు సింగపూర్ నుంచి ప్రత్యేక సబ్‌మెరైన్ కేబుల్ వేస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. సాంకేతికత రాజ్యమేలుతున్న నేపథ్యంలో.. డేటా స్టోరేజ్ పెంచడం, డిజిటలైజేషన్ విస్తరించడం, డేటా వేగం పెరగడం.. ఇలా విభిన్నమైన ప్రయోజనాలు అందించే ఈ ప్రాజెక్టు ద్వారా ఐటీ పరిశ్రమలు విశాఖకు క్యూ కట్టనున్నాయి. ఫలితంగా మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉత్తరాంధ్ర యువతకు రానున్నాయి.



అచ్యుతాపురం ఫార్మాసిటీలోని లారస్ ల్యాబ్‌లో మందుల తయారీని పరిశీలిస్తున్న సీఎం జగన్

ఫార్మాలో కొలువుల జాతర

మరోవైపు ఫార్మా రంగంలోనూ ఉమ్మడి విశాఖ కీలకంగా మారుతోంది. అచ్యుతాపురం, పరవాడ సెజ్‌లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఫార్మా కంపెనీల కొత్త యూనిట్ల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు జరిగాయి. రూ.500 కోట్లతో ఫార్మాసిటీలో 20 ఎకరాల్లో ఏర్పాటైన అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ యుజియా స్టెర్లీ యూనిట్ ప్రారంభించడం ద్వారా 750 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. అచ్యుతాపురంలో లారస్ సంస్థ రూ. 440 కోట్లతో నిర్మించిన ఫార్ములేషన్ బ్లాక్‌ను, రూ. 191 కోట్లతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 300 మందికి ఉపాధి కల్పిస్తున్న యూనిట్-2ను సీఎం ప్రారంభించారు. అదేవిధంగా రూ. 240 కోట్లతో 450 మందికి ఉపాధి కల్పించే ఉద్దేశంతో పరవాడ వద్ద నిర్మించనున్న యూనిట్-3తో పాటు మరో రూ. 240 కోట్లతో నిర్మించనున్న యూనిట్-7కు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ యూనిట్ ద్వారా 450 మందికి ఉపాధి లభించనుంది. మొత్తం రూ.1,611 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ పరిశ్రమల ద్వారా 2,450 మందికి ఉపాధి లభించనుంది.





పరవాడ ఫార్మాసిటీలోని యుజియా స్టెర్లీ కంపెనీలో డబ్ల్యూఎఫ్ఐ జనరేషన్ సిస్టంను ప్రారంభిస్తున్న సీఎం జగన్, టెక్నీషియన్‌కు ఆత్మీయ పలకరింపు

న్యూస్‌రీల్

ధనలక్ష్మిగా కనకమహాలక్ష్మి



డాబాగార్డెన్స్: కనక మహాలక్ష్మి అమ్మవారు సోమవారం ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మ వారికి లక్ష చామంతులతో పూజ నిర్వహించారు. మందుగా సంకల్పం, మండపారాధన, కలశస్థాపన, సప్తశతి, మహావిద్యా, శ్రీచక్ర నవావర్ణార్చన జరిపారు. లక్ష చామంతుల పూజ అలంకరణ దాతలు బెంగళూరుకు చెందిన జి.సిద్ధార్థ్, వాణి దంపతులు, నగరానికి చెందిన ఆర్.సతీష్, రాధిక దంపతులతో పాటు తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని అలంకరించేందుకు పట్టు చీరలు అందించిన లక్కీ, సౌత్ ఇండియా షాపింగ్ మాల్స్ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మంగళవారం ధాన్యలక్ష్మి అలంకరణలో కనకమహాలక్ష్మి దర్శనమిస్తారని, లడ్డూలతో పూజ నిర్వహిస్తామని ఈవో కె.శిరీష తెలిపారు.

సింహగిరిపై రాత్రివేళ అన్న ప్రసాద వితరణ



అన్న ప్రసాద వితరణ ప్రారంభిస్తున్న ఈవో

సింహాచలం: సింహగిరిపై రాత్రి వేళ భక్తులకు అన్న ప్రసాద వితరణను సోమవారం రాత్రి నుంచి తిరిగి ప్రారంభించారు. కరోనాకు ముందు 2020 మార్చి వరకు పగలు, రాత్రి వేళల్లో భక్తులకు అన్న ప్రసాదం అందించేవారు. కరోనా తర్వాత ఇప్పటి వరకు కేవలం మధ్యాహ్నం మాత్రమే అన్నప్రసాదం అందిస్తున్నారు. ఇటీవల దేవస్థానం ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఎస్.శ్రీనివాసమూర్తి రాత్రి వేళల్లో అన్న ప్రసాద వితరణ పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం రాత్రి నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. అన్నప్రసాద భవనంలో శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి చిత్రపటం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం ఈవో పలువురు భక్తులకు అన్న ప్రసాదం అందించారు. ఇక నుంచి రాత్రి వేళల్లో 200 మందికి కదంబం(ముక్కల పులుసు అన్నం) అందిస్తామని తెలిపారు.

నవంబర్ 8న రైల్వేలో ప్రత్యేక అదాలత్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో పెండింగ్ కారుణ్య నియామక పెన్షన్ కేసులకు సంబంధించి నవంబర్ 8న ప్రత్యేక అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. దొండపర్తి డీఆర్ఎం కార్యాలయంలోని సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అదాలత్ ఉంటుందన్నారు. తగిన ఫార్మాట్‌లో మరణించిన రైల్వే అధికారులు, పింఛన్‌దారుల వివరాలను ఎ-4 పేపర్‌పై రాసి.. అక్టోబరు 31లోగా డివిజనల్ రైల్వే మేనేజర్(పి), మొదటి అంతస్తు, డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం కాంప్లెక్స్, దొండపర్తి చిరునామాకు పంపించాలన్నారు. కవరుపై కారుణ్య అదాలత్- 2023/ఈస్ట్‌కోస్ట్ రైల్వే/వాల్తేర్ అని కచ్చితంగా రాయాలని సూచించారు.

ఈవీఎంల తొలి దశ తనిఖీ ప్రారంభం

అరిలోవ: ఎన్నికల సంఘం ఆదేశాలతో ఈవీఎంల తొలి దశ తనిఖీ(ఎఫ్ఎల్‌సీ) సోమవారం ప్రారంభమైంది. రూరల్ రెవెన్యూ కార్యాలయం వద్ద గల గొడౌన్‌లోని ఈవీఎంలను వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఎన్నికలు, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈవీఎంల పనితీరును ఇంజినీర్లు తనిఖీ చేశారు. వచ్చే ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలను సిద్ధం చేయడానికి ఈ తనిఖీ జరుగుతోందని రూరల్ తహసీల్దార్ సనపల రమణయ్య తెలిపారు. 25 నుంచి 30 రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి.. పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాజకీయ నాయకులు, అధికారుల సెల్‌ఫోన్లను లోపలకు అనుమతించడం లేదని స్పష్టం చేశారు.

రేపు పెందుర్తిలో జగనన్నకు చెబుదాం

మహారాణిపేట: పెందుర్తిలో ఈ నెల 18న జగనన్నకు చెబుదాం మండల స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. మహిళా ప్రగతి కేంద్రంలోని జిల్లా మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రజలు పాల్గొని అధికారులకు నేరుగా సమస్యలను తెలియజేయవచ్చన్నారు.

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయండి

అధికారులకు జేసీ విశ్వనాథన్ ఆదేశం

మహారాణిపేట: వారం రోజుల్లో ధాన్యం సేకరణకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. తన చాంబర్‌లో సోమవారం ధాన్యం సేకరణ ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ధాన్యం సేకరణకు సంబంధించి ఆయా శాఖలకు కేటాయించిన పనులపై తీసుకున్న చర్యల నివేదికలను తర్వాత సమావేశంలో సమర్పించాలని కోరారు. నిర్లక్ష్యం చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ, మండల స్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతీ రైతు భరోసా కేంద్రానికి నాలుగు లేక ఐదు వాహనాలు కేటాయించి ట్యాగింగ్ చేయించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మిల్లర్ల రిజిస్ట్రేషన్, వే బ్రిడ్జి ట్యాగింగ్ పూర్తి చేయాలని, సీసీ కెమెరాలు సిద్ధం చేయాలని, అవసరమైన సంచులను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం సేకరణపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని, ఈ-క్రాప్, వాహనాల గుర్తింపు రిజిస్ట్రేషన్ వివరాలను ప్రతి రోజూ నివేదించాలని సూచించారు. సమీక్షలో సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ ఐ.రాజేశ్వరి, జిల్లా సప్లయి అధికారి సూర్యప్రకాశరావు, వ్యవసాయ, మార్కెఫెడ్, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.



ధాన్యం సేకరణపై సమీక్షిస్తున్న జేసీ విశ్వనాథన్

18న విద్యుత్ వాహనాలపై అవగాహన సదస్సు

మహారాణిపేట: జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఈ నెల 18న విద్యుత్ వాహనాల వాడకంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు నెడ్‌క్యాప్ ప్రతినిధి ఎం.విజయకుమార్ రాజు తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఈ అవగాహన కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు డౌన్ పేమెంట్ లేకుండా ఈఎంఐ సదుపాయంతో వాహనాలు అందజేస్తామన్నారు. ఇంధన వనరులను పొదుపు చేయడం, విద్యుత్ వాహనాల ఆవశ్యకతను వినియోగదారులకు వివరించేందుకు ఈ మేళా ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు.

3,862 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా సోమవారం 22 ప్రాంతాల్లో నిర్వహించిన వైద్య శిబిరాల్లో 3,862 మందికి వైద్య సేవలు అందించినట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. ఆరిలోవ పరిధి తోటగరువు(03), బక్కన్నపాలెం-సాయిరామ్ కాలనీ, బాలాజీనగర్-పార్వతీనగర్, లాసన్స్‌బే కాలనీ-గొల్లవీధి(01), విద్యానగర్ కాలనీ-ఎల్‌బీ కాలనీ, పాత రేసవానిపాలెం-టీపీటీ కాలనీ, రంగిరీజు వీధి-బురుజుపేట, చెంగల్రావుపేట-చందక వీధి, కొబ్బరితోట-కుమ్మరివీధి, రైల్వే న్యూకాలనీ-సుబ్బలక్ష్మీనగర్, అంబేడ్కర్ కాలనీ-మాధవధార, భవానీ గార్డెన్స్-తుమ్మడిపాలెం, ఏఎస్ఆర్ నగర్-మురళీనగర్, నక్కవానిపాలెం-హిమాచల్‌నగర్, శ్రామికనగర్-2-వెదుళ్లనరవ, కణితి-కళింగ నగర్, బుచ్చిరాజుపాలెం-బుచ్చిరాజుపాలెం(01), పెందుర్తి-మర్రిచెట్లకాలనీ, నరసింహనగర్-5 పరిధి గోపాలపట్నంలో వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. రూరల్‌లో ఆనందపురం పరిధి గండిగుండం, భీమిలి పరిధి దాకమర్రి, పద్మనాభం పరిధి అనంతవరంలో శిబిరాలు జరిగాయన్నారు. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు మంగళవారం 23 ప్రాంతాల్లో నిర్వహించనున్నారు.

కౌన్సిల్ ముందుకు 11 అనుబంధ అంశాలు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఈ నెల 19న నిర్వహించనున్న సర్వసభ్య సమావేశానికి మరికొన్ని అనుబంధ అంశాలను పొందుపరిచారు. 57 అజెండా అంశాలతో పాటు 11 అనుబంధ అంశాలపై మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో సభ్యులు చర్చించి ఆమోదించనున్నారు. జీవీఎంసీ నరవ వద్ద గల 33 ఎంజీడీ గోదావరి నీటి శుద్ధి కేంద్రానికి 2023-24 ఏడాదికి రూ.75.40 లక్షలతో అల్యూమినా ఫెర్రిక్ ఆలం సరఫరా, జోన్-3 పరిధి 21వ వార్డు పాండురంగాపురంలోని జీవీఎంసీ అధునాతన అతిథి గృహంలో రూ.1.99 కోట్లతో మొదటి, రెండో అంతస్తులు, గ్రౌండ్ ఫ్లోర్‌లో మిగిలిన పనులు పూర్తి, జోన్-4 పరిధి 30వ వార్డు కోడిపండ్యాల వీధిలో రహదారి విస్తరణ, రక్షణ గోడ నిర్మాణం, జోన్-4 పరిధి 31వ వార్డులో రూ.75.70 లక్షలతో జీవీఎంసీ కార్యాలయం నుంచి ఆశీల్‌మెట్ట జంక్షన్ వరకు అండర్‌పాత్‌వే వద్ద బీటీ రోడ్డు, థర్మో ప్లాస్టిక్ పెయింటింగ్, స్టడ్స్ ఏర్పాటు, జోన్-4 పరిధి వాచ్‌హౌస్ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ జంక్షన్ వరకు 9 మీటర్ల పొడవు గల సింగల్ ఆర్మ్ ఆక్టోగనల్ పోల్స్‌తో పాటు ఎల్ఈడీ లైట్లు, మోడ్రన్ లైటింగ్ ఏర్పాటు, 15వ ఆర్థిక సంఘం మిలియన్ ప్లస్ నగరాల్లో పరిసర గాలి నాణ్యత మెరుగుదల, ప్రతిపాదిత పనులకు సీడీఎంఏ పరిపాలన ఆమోదం తదితర అంశాలు కౌన్సిల్ ముందుకు చర్చకు రానున్నాయి.



అధికారుల దృష్టికి పలు సమస్యలు

- జీవీఎంసీ 'జగనన్నకు చెబుదాం'కు 57 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ వర్మ

డాబాగార్డెన్స్: జోన్-5లో అనధికార, అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయంటూ గవర కంచరపాలెం నుంచి అన్నె నారాయణరావు, పవన్‌పుత్రా కాలనీ నుంచి కర్రి అప్పలసత్యనారాయణ ఫిర్యాదు చేశారు. జోన్-4 పరిధి అల్లిపురం వేంకటేశ్వరమెట్ట వద్ద మంచినీటి సరఫరా జరగడం లేదని తోట వాసుదేవరావు.. జోన్-2 పరిధి పార్వతీనగర్‌లో ఓపెన్ డ్రైన్‌లు మరమ్మతులు చేపట్టాలని ద్రాక్షారపు విజయలక్ష్మి.. ఇలా పలువురు పలు జోన్ల నుంచి వివిధ సమస్యలపై సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు.

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో వివిధ జోన్ల నుంచి 57 వినతులు అందాయి. వీటిలో ముఖ్యంగా కాలువల్లో వ్యర్థాలు తొలగించాలని, ఖాళీ స్థలాలపై పన్ను విధించాలని, తాగునీటి సమస్య, అనధికార నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చాయని అదనపు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, డీసీపీ నరేంద్రరెడ్డి, కార్యదర్శి పి నల్లనయ్య, ఎఫ్ఏ అండ్ ఏవో మల్లికాంబ, డీపీఓ చంద్రిక, యూసీడీ పీవో సూర్యకళ, పర్యవేక్షక ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

151 అర్జీల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో మోహన్ కుమార్

మహారాణిపేట: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులు సకాలంలో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జగనన్నకు చెబుదాంకు వచ్చే అర్జీలు సకాలంలో పరిష్కరించాలన్నారు. సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 151 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో పూర్ణిమాదేవి, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 28 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుల నుంచి సమస్యను తెలుసుకుంటున్న అడ్మిన్ ఏడీసీపీ ఎంఆర్‌కే రాజు

అల్లిపురం: ప్రతి సోమవారం పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించే పోలీస్ స్పందనకు 28 ఫిర్యాదులు వచ్చినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఏ.రవిశంకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో జరిగిన స్పందన కార్యక్రమంలో అడ్మిన్ ఏడీసీపీ ఎం.ఆర్.కె.రాజు పాల్గొని బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వాటిని పరిశీలించి డీసీపీకు విన్నవించారు. వాటిని పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ సమస్యకు సంబంధించి చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదు దారుల సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులు కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్యభర్తలు గొడవలు, మోసాలకు సంబంధించినవి, సివిల్ కేసులు ఉన్నట్లు తెలిపారు.



సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న మేయర్ హరి వెంకట కుమారి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ,పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్

సీఎం జగన్‌కు ఆత్మీయ స్వాగతం

సాక్షి, అనకాపల్లి: విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పర్యటన నిమిత్తం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. సీఎం జగన్ గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి సోమవారం ఉదయం బయలుదేరి 10.35 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, గొడ్డేటి మాధవి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, అధికారులు సీఎం జగన్‌కు స్వాగతం పలికారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.20 గంటలకు మధురవాడ ఐటీ హిల్స్ నం.3 వద్ద గల హెలిప్యాడ్‌కు, అక్కడ నుంచి రోడ్డు మార్గంలో ఐటీ హిల్ నం.2లోని ఇన్ఫోసిస్‌కు చేరుకున్నారు. అక్కడ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఇన్ఫోసిస్ ప్రతినిధులు, పరిశ్రమలు, ఐటీ శాఖ కార్యదర్శి కోన శశిధర్, కలెక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఇతర ఉన్నతాధికారులు, పారిశ్రామిక వేత్తలు స్వాగతం పలికారు. ఇన్ఫోసిస్ కార్యకలాపాలను సీఎం వైఎస్ జగన్ లాంఛనంగా ప్రారంభించారు. ఇన్ఫోసిస్, వివిధ కంపెనీల ఐటీ అధికారులతో ముఖ్యమంత్రి కాసేపు సంభాషించారు. అక్కడ కార్యక్రమం ముగించుకుని 12.36 గంటలకు బయలుదేరి తిరిగి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ హెలికాప్టర్‌లో బయలుదేరి 1.05 గంటలకు పరవాడలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి బయలుదేరి ఫార్మా సిటీలోని యుజియా స్టెర్లీ లిమిటెడ్ కంపెనీకి 1.20 గంటలకు చేరుకుని.. ఆ కంపెనీని ప్రారంభించారు. అనంతరం కంపెనీ సీఈవో, డైరెక్టర్‌లతో సమావేశమయ్యారు. అక్కడ నుంచి 2.10 గంటలకు బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ 2.15కు బయలుదేరి అచ్యుతాపురం సెజ్‌లో హెలిప్యాడ్ వద్దకు 2.25కు చేరుకున్నారు. అక్కడ నుంచి లారస్ ల్యాబ్‌కు చేరుకుని యూనిట్-2ను ప్రారంభించారు. పరిశ్రమ సందర్శన, అక్కడ కంపెనీ సీఈవో, డైరెక్టర్లు, ఉద్యోగులతో సమావేశమయ్యారు. దాదాపు గంట పాటు లారస్ ఫార్మా కంపెనీలో గడిపారు. అనంతరం 3.25 గంటలకు హెలిప్యాడ్ వద్దకు, 3.50 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. 3.57 గంటలకు గన్నవరంకు విమానంలో బయలుదేరారు.

ముఖ్యమంత్రికి వీడ్కోలు

విశాఖ విమానాశ్రయంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కలెక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులు ముఖ్యమంత్రికి ఆత్మీయ వీడ్కోలు పలికారు.

స్టీల్‌ప్లాంట్‌లోకి జిందాల్ ప్రవేశాన్ని వ్యతిరేకిస్తున్నాం



స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్-3 ద్వారా జిందాల్ సంస్థ ప్రవేశించడానికి తాము వ్యతిరేకిస్తున్నామని స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాలు స్పష్టం చేశాయి. ఈ మేరకు సోమవారం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు లేఖ అందజేశారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల కష్టంతో అభివృద్ధి చేసుకున్న ప్లాంట్‌ను యాజమాన్యం చెప్పేదొకటి, చేసేదొకటిగా ప్రవర్తిస్తూ ప్రైవేటీకరణకు అడుగులు వేస్తోందన్నారు. ప్రైవెటైజేషన్ ఏ రూపంలో ఉన్నా దాన్ని వ్యతిరేకించి తీరుతామన్నారు. రా మెటీరియల్ ఈవోఐ తేల్చేముందు తమతో చర్చిస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. రా మెటీరియల్ ఈవోఐ జిందాల్‌తో చేయడానికి సిద్ధమైన అంశం తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్లాంట్ పూర్తి సామర్థ్యానికి అవసరమైన రా మెటీరియల్ కోసం సెయిల్, ఎన్ఎండీసీల మద్దతు తీసుకోవాలని ఉక్కు మంత్రిత్వశాఖ యాజమాన్యానికి తెలిపిన విషయాన్ని వారు గుర్తు చేశారు. బ్లాస్ట్‌ఫర్నేస్-3 ప్రారంభించే చర్యలు తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై యాజమాన్యం సానుకూలంగా వ్యవహరించకపోతే జరగాల్సిన పరిణామాలకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు డి. ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్, వై.మస్తానప్ప, డి.అప్పారావు, బొడ్డు పైడిరాజు, వరసాల శ్రీనివాస్, సన్యాసిరావు, టి.జగదీష్ పాల్గొన్నారు.

ప్రముఖ సంస్థలతో ప్రభుత్వ మహిళా కళాశాల ఒప్పందం



కళాశాలల విద్యా కమిషనర్ పోలా భాస్కర్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ (యునెస్కో), మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఫర్ పీస్ అండ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ (ఎంజీఐఈపీ), సొసైటీ ఆఫ్ జేకేసీ (కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్) మధ్య అవగాహన ఒప్పందం సోమవారం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వేదికగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి గ్లోబల్ మెమోరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్ పత్రాల మార్పిడికి, ప్రభుత్వ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కార్యక్రమాలు హైలెట్ చేశారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ స్పెషల్ డ్యూటీ ఆఫీసర్ డాక్టర్ పి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ 2030 నాటికి విద్యార్థులందరూ స్థిరమైన జీవనశైలి, మానవహక్కుల జ్ఞానాన్ని పొందేలా చూడాలని పేర్కొంటూ ఎస్ఈఈకే అండ్ ఎస్ఈఎల్ సర్టిఫికెట్ కోర్సుల ఆవశ్యకతను వివరించారు. కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో ఫిజికల్ కోటియంట్, ఇంటెలిజెన్స్ కోటియంట్, ఎమోషనల్ కోటియంట్, స్పిరిచ్యువల్ కోటియంట్ అభివృద్ధిని వివరించారు. సమగ్ర విద్యను అందించడంలో పైన పేర్కొన్న అంశాలకు ప్రాధాన్యత నివ్వడం, డిగ్రీ కళాశాలలు www. framespace. com పోర్టల్ ద్వారా ఎస్‌డీజీ4.7 ఎన్ఈపీ 2020 ప్రకారం యూత్ వేజింగ్ పీస్ కోర్స్‌కు సోషల్ ఎమోషనల్ లెర్నింగ్, స్వీయ-దర్శకత్వం ఎమోషనల్ లెర్నింగ్ కోర్సులు సులభతరం చేసేందుకు యునెస్కో ఎంజీఐఈపీతో కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ మెమోరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్ ప్రారంభించారు. యునెస్కో, ఎంజీఐఈపీ డైరెక్టర్ డాక్టర్ అనంత దురైయప్ప, యూత్ వేజింగ్ పీస్ కోర్స్‌లపై ఇంట్రాక్టివ్ సెషన్స్ నిర్వహించారు. కళాశాల ఎన్‌సీసీ కేడెట్ సీహెచ్ లక్ష్మీపల్లవి ఇటీవల ఢిల్లీలో ఆలిండియా థాల్ సైనిక్ క్యాంప్‌లో పాల్గొని జడ్జిడంగ్ డిస్టెన్స్ అండ్ ఫీల్డ్ సిగ్నల్స్ ఈవెంట్‌లో రజత పతకం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకొని కళాశాలల విద్యా కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అభినందించారు. కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి.అరుణపద్మ, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు కొమ్మినేని విశాఖ రాక

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ సి.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. సాయంత్రం 5 గంటలకు సింహాచలం దేవస్థానం పరిధిలోని ఆనంద నిలయానికి చేరుకుంటారు. కాసేపు విశ్రాంతి తర్వాత అప్పన్నస్వామిని దర్శించుకుంటారు. అనంతరం 7 నుంచి 7.30 గంటల వరకు మీడియా మిత్రులతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. రాత్రికి ఆనంద నిలయంలో బస చేస్తారు. బుధవారం ఉదయం రోడ్డు మార్గం ద్వారా విజయనగరం వెళతారు.

వీపీటీ అభివృద్ధి పనుల ప్రారంభం నేడు

మహారాణిపేట: విశాఖపట్నం పోర్టు ఆధ్వర్యంలో జరిగిన పలు అభివృద్ధి పనులు, పలు ప్రాజెక్టులను ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా మంగళవారం ప్రారంభించ నున్నారు. ఫిషింగ్ హార్బర్ సమీపంలో పోర్టుకు చెందిన 2, 3 బెర్త్‌ల విస్తరణ, డబ్ల్యూక్యూ 6,7,8 బెర్త్‌లు, ఈక్యూ పనులను పోర్టు ట్రస్టు పూర్తి చేసింది.

'ఆ ధోరణి సరైంది కాదు'

ఎంవీపీకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాలపై వ్యవహరిస్తున్న తీరు నిరంకుశ పాలనకు నిదర్శనమని టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఎంవీపీ కాలనీలోని ఆయని నివాసంలో మీడియాతో మాట్లాడారు. సీఎం పర్యటన ఉంటే ప్రతిపక్షాలను నిర్బంధించే చర్యలకు పాల్పడుతుందన్నారు. ఈ తరహా ధోరణి సరైంది కాదన్నారు.నల్ల బెలూన్లు ఎగరవేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

మహిళ హత్య కేసులో యావజ్జీవ జైలు శిక్ష

విశాఖ లీగల్ : వ్యక్తిగత కక్షతో మహిళా హత్యకు కారకుడైన నిందితుడికి యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ విశాఖ నగరంలోని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి గోవర్ధన్ సోమవారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతోపాటు రూ.2 వేల జరిమానా చెల్లించాలని, లేని పక్షంలో అదనంగా ఆర్నెల్ల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి. దేవానంద్ వివరాల ప్రకారం... ఉమ్మడి విశాఖ జిల్లా గొలుగొండ మండలం జోగుంపేట గ్రామానికి చెందిన నిందితుడు తెరపల్లి అర్జున (60) గొలుగొండకు చెందిన చెట్ల మహాలక్ష్మిపై కక్ష పెంచుకున్నాడు. తనతో వివాహేతర బంధం కొనసాగించాలని కోరాడు. అందుకు ఆమె నిరాకరించడంతో పలుమార్లు శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఈ నేపథ్యంలో 2014 జులై మూడో తేదీ తెల్లవారుజాము నాలుగు గంటల సమయంలో లక్ష్మి ఇంటికి వచ్చి తన వెంట తీసుకొచ్చిన స్టీల్ క్యారేజీలో యాసిడ్ ఆమెపై పోశాడు. దాంతో శరీరమంతా కాలిపోయింది. తొలుత స్థానికులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లి, అక్కడి నుంచి విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు అర్జున్‌పై కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

బాస్కెట్‌బాల్ చాంప్ దక్షిణ మధ్య క్షేత్ర

- సత్తాచాటిన రాజస్థాన్ క్షేత్ర, ఉత్తర క్షేత్ర జట్లు



అండర్ 19 బాలుర విజేత డీఎంఎస్ జట్టు

విశాఖ స్పోర్ట్స్ : విద్యా భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ 34వ జాతీయ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో డీఎంఎస్, రాజస్థాన్ క్షేత్ర, ఉత్తరక్షేత్ర విద్యార్థులు సత్తాచాటారు. భారతీయ విద్యా కేంద్రం ఆధ్వర్యంలో ఈ పోటీలు విశాఖలోని నాలుగు వేదికల్లో నిర్వహించారు. అండర్ 14 బాలురలో రాజస్థాన్ క్షేత్ర జట్టు, బాలికల్లో దక్షిణ మధ్య క్షేత్ర (డీఎంఎస్) జట్టు విజేతగా నిలిచాయి. బాలురలో వెస్ట్ యూపీ, పశ్చిమ్ క్షేత్ర జట్లు, బాలికల్లో ఉత్తరక్షేత్ర, రాజస్థాన్ క్షేత్ర జట్లు వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. అండర్ 17 బాలురలో రాజస్థాన్ క్షేత్ర, బాలికల్లో ఉత్తరక్షేత్ర జట్లు విజేతలుగా నిలిచాయి. బాలురలో వెస్ట్‌యూపీ, మధ్యక్షేత్ర, బాలికల్లో రాజస్థాన్ క్షేత్ర, వెస్ట్‌యూపీ జట్లు వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. అండర్ 19 బాలుర, బాలికల విభాగాల్లో డీఎంఎస్ జట్లు విజేతలుగా నిలవగా, బాలుర విభాగంలో వెస్ట్‌యూపీ, ఉత్తర క్షేత్ర జట్లు బాలికల విభాగంలో ఈస్ట్‌యూపీ, వెస్ట్ యూపీ జట్లు వరుసగా రన్నరప్, సెకండ్ రన్నరప్‌గా నిలిచి ట్రోఫీలందుకున్నాయి. అండర్ 14,17,19 కేటగిరీల్లో ఈ పోటీలు నిర్వహించగా మొత్తంగా బాలురలో 23, బాలికల్లో 19 విద్యా భారతి జట్లు ఆయా కేటగిరీల్లో పోటీపడ్డాయి.

జన్మభూమి, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరణ

తాటిచెట్లపాలెం : గతంలో రద్దు చేసినట్లు ప్రకటించిన రైళ్లను తిరిగి పునరుద్ధరిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి విశాఖపట్నం - లింగంపల్లి (12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం - విశాఖపట్నం (17219) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 18 నుంచి లింగంపల్లి - విశాఖపట్నం (12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం - మచిలీపట్నం (17220) ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ప్రీ ప్రైమరీ స్కూళ్లకు మహర్దశ

- పాఠశాల ప్రాంగణాల్లోనే అంగన్‌వాడీలు
- నాడు-నేడు నిధులతో 13 చోట్ల నూతన భవనాలు
- రూ.1 కోటితో 20 కేంద్రాలకు మరమ్మతులు
- ఫర్నిచర్‌కు ఒక్కో కేంద్రానికి రూ.2.50 లక్షల మంజూరు
- కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- ఇంగ్లిషు మీడియం చదువులకు పటిష్టమైన పునాదులు



మరమ్మతులకు నిధులు మంజూరైన పెందుర్తి మండలంలోని సరిపల్లి అంగన్‌వాడీ కేంద్రం

విశాఖ విద్య: అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూళ్లగా మార్పు చేస్తున్న నేపథ్యంలో వీటిలో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు దృష్టి సారించారు. దీనిలో భాగంగానే నాడు-నేడు రెండో దశలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన 13 కేంద్రాలకు అధునాతన భవనాలు నిర్మిస్తున్నారు. పద్మనాభం మండలం మద్దిబంద, కొయ్యపేట మినహా, జిల్లాలోని మిగతా అన్ని చోట్ల ఇప్పటికే పనులు దాదాపుగా పూర్తికావొచ్చాయి. అదే విధంగా జిల్లాలో సొంత భవనాలు ఉన్న 20 కేంద్రాలకు ఒక్కో చోట రూ.5 లక్షలతో భవనాలకు మరమ్మతులు చేస్తున్నారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసేలా ఐసీడీఎస్, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు దశల వారీగా నిధులు కేటాయించి పక్కా భవనాలు నిర్మించేలా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

పటిష్టమైన పునాదులు వేసేలా..

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం బోధన అమలు చేస్తున్న నేపథ్యంలో ఇందుకు అంగన్‌వాడీల్లోనే పటిష్టమైన పునాదులు వేసేలా కార్యాచరణ సిద్ధమైంది. జాతీయ విద్యా విధానం అమల్లో భాగంగా అంగన్‌వాడీలను సమీప ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేసి, ప్రీ ప్రైమరీ స్కూళ్ల పేరుతో 3 నుంచి 6 ఏళ్ల వయస్సుని పిల్లలకు విద్యాబోధన అందిస్తున్నారు. ఎల్‌కేజీ, యూకేజీ ఇదే చోట నిర్వహించనున్నారు. దీంతో అంగన్‌వాడీల్లో అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించేలా అధికారులు శ్రద్ధ తీసుకుంటున్నారు.

కేంద్రాలకు ఫర్నిచర్

నాడు-నేడులో నూతనంగా నిర్మించే కేంద్రాలకు పిల్లలకు కూర్చొనేందుకు అనువైన కుర్చీలు, బల్లలను ఇప్పటికే సరఫరా చేశారు. అదే విధంగా ఉయ్యాల, జారుడుబల్ల, ఇతర ఆట వస్తువులను సైతం సమకూర్చనున్నారు. ప్రతీ కేంద్రంలో తాగునీరు, విద్యుత్ సరఫరా, ఆట స్థలం, కేంద్రానికి కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టేలా పనుల్లో ప్రాధాన్యత ఇస్తున్నారు.

జిల్లాలో ఇలా:-

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	: 3
అంగన్‌వాడీ కేంద్రాలు	: 776
6 నెలల నుంచి 3 ఏళ్ల వరకు పిల్లలు	: 53,681
3-6 ఏళ్ల పిల్లలు	: 13,747
సొంత భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాలు	: 188
అద్దె లేకుండా నిర్వహిస్తున్న కేంద్రాలు	: 372
అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాలు	: 216

సౌకర్యాలు మెరుగు



అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా వసతి కల్పించేలా ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటోంది. కేంద్రాల్లో మౌలిక వసతుల పెంపొందించేలా నాడు-నేడు కార్యక్రమంలో నిధులు మంజూరు కావడం సంతోషం. పిల్లలకు ఆట వస్తువులు కూడాసమకూరనున్నాయి. -డి.వెంకటేశ్వరి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, విశాఖ జిల్లా

సకాలంలో పనులు పూర్తి



నాడు-నేడులో అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా భవననిర్మాణాల కోసం ప్రభుత్వం నిధు లు మంజూరు చేసింది. స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ, పనులు సకాలంలో పూర్తి చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. - నరసింహారావు, సమగ్ర శిక్ష ఈఈ, విశాఖ జిల్లా